సంస్కరించుటకును, దర్పమువలన గర్వించిన దుర్జనకులమును, సంహరించుటకును, ఎల్లప్పుడును దీక్షతోఁగూడినదై యున్నది.

ప్రభ:- గర్తము = నిమ్నస్థలము - గాత. ఉద్ధరించుటకు = బయటికి లాగుటకు, సంస్కరించుటకు = విశుద్ధుని చేయుటకు, సంహరించుటకు = ధ్వంసముచేయుటకుఁ దీక్షతో, గూడినది = వ్రతమును ధరించునది.

మూ॥ మృద్వీకాం మధురతయా సుధాంమహిమ్నా
గామ్భీర్యాత్ సురతటినీం చనిజఉయన్తీ
శర్వాణీచరితపరాప్రహర్షిణీనాం
శ్రేణీయం జయతు గణేశ్వరేణబద్ధా॥ 25

మాధుర్యము చేత ద్రాక్షను, మహాత్మ్యము చేత, అమృతమును, గాంభీర్యము వలన దేవనదియగుగంగను, నిర్జించునదియు, శర్వాణియొక్క కథయే ప్రధానముగాఁ గలదియు, గణపతిచే నిబంధింపఁబడినదియు నగు ఈ ప్రహర్షిణీ వృత్తమాలిక - జయించుఁగాత!

ప్రభ:-ప్రహర్షిణీవృత్త మాలిక, ఇచట బహువిధములుగా నుల్లేఖింపఁబడుట వలన, నిది యుల్లేఖాలం కారమని తలపంఁదగదు. మాధుర్యాదుల చేత-ద్రాక్షాదులను నిర్జించునదియని ఉపమాసూచకమగు 'నిర్జించునది' అనుపదము యొక్క ప్రయోగము వలన ఒక వస్తువునకు - అనేకములగు నుపమానములు చెప్పఁబడుటవలన ఇది - అర్థియగు మాలోపమాలంకారమగునని తెలియునది.

ఇది సవ్యాఖ్యమగు పదునెనిమిదవ స్తబకము

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (పంచమ శతకము – తృతీయస్తబకము)

### ఏకోనవింశ స్తబకము

మూ॥ ప్రఫుల్ల కల్పపాదప ప్రసూన సద్యశోహరమ్
మహోరుజం ధునోతుతే మహేశసున్దరీ స్మితమ్॥ 1

వికసించిన కల్పతరు ప్రసూనము యొక్క 'సత్కీర్తిని హరించునదియగు మహేశ్వర సుందరియొక్క హసితము- మీ యొక్క మహా రోగమును (సంసారమను రోగమును) తొలఁగించుగాత!

ప్రభ:- అమరలోకజన్యమగుట వలన సర్వాభీప్సితప్రదమును, సర్వరోగ నివారణమును, స్పృహణీయదర్శనమును, అగు ప్రఫుల్ల కల్పవృక్ష కుసుమము యొక్క ఖ్యాతినిగాఢ హరించుచున్న మహేశ్వరీమంద స్మితము - రోగములన్నింటియందును గొప్పదగు భవరోగమును నశింపఁజేయునుగాతమని తాత్పర్యము.

మూ॥ మునీన్ద్రమూల వేదిభూధనఞ్జయ ప్రబోధనమ్।
యతీన్ద్రహార్దపేటిక కవాటబన్ధభేదనమ్॥ 2

మునీంద్రులయొక్క మూలాధారమేయగు వేదిభూమి (పరిష్కృతమగు భూమి) యందలి యగ్నిని ప్రబోధించునదియు యతీంద్రుల హృదయమను పేటిక యొక్క కవాటమును (తలుపు) తెఱచునదియు.

మూ॥ యథా విధిక్రియపర ద్విజాతి చిత్తశోధనమ్।
మమామ్బికాస్మితం భవత్వఘప్రతాపరోధనమ్॥ 3

శాస్త్రవిధి నతిక్రమింపక క్రియాపరులగు ద్విజుల చిత్తములను పరిశుద్ధముల నొనర్చునదియు, అగు శ్రీమాతయొక్క మందస్మితము నాయొక్క పాపముల ప్రతాపమును నివారించునది యగుఁగాత!

ప్రభ:- యోగమార్గము నవలంబించు వారికి మూలాగ్ని నుజ్జ్వలింపఁజేయు నదియు, జ్ఞానమార్గము నాశ్రయించువారి హృదయము నున్మీలింపఁజేయునదియు, శాస్త్రోక్తమార్గమున ప్రవర్తించువారి చిత్తమును శోధించునదియు నగు దేవీమందహాసము – నాపాపములను తొలఁగించుఁగాతమని భావము.

మూ॥ సువర్ణసాలభఞ్జికా చ రేవశోభయాఽధికా
అతీవమార్దవాన్వితా నవేవపుష్పితా లతా॥ 4

కదలుచున్న బంగారుబొమ్మవలె అమితమగు కాంతిగలదియు, క్రొత్తదియు, పుష్పించినదియు నగు లతవలె అధికమగు మార్దవముతోఁ గూడినదియు,

మూ॥ సుపర్వమౌళిరత్న భావిరాజిహేమపాదుకా
మరాలికానిమన్త్రక ప్రశస్తరత్ననూపురా॥ 5

అమరుల యొక్క కిరీటములందలి రత్నముల కాంతులచేత విరాజిల్లుచున్న బంగారు పాదుకలు గలదియు, ప్రశస్తమును, రత్నఖచితమును అగు కాలియందెల చేత- హంసీబృందము నాహ్వానించునదియు,

మూ॥ వలక్ష దీధితి ప్రభావిశేష హృన్నఖావలీ
మునీన్ద్రశుద్ధమానస ప్రమేయ పాద సౌష్ఠవా॥ 6



ధవలాంశుఁడగు చంద్రుని ప్రభావిశేషములను హరించునఖావలి గలదియు, మునీంద్రుల యొక్క పరిశుద్ధమగు మనసుచేత తెలియఁదగిన పాదసౌష్ఠవము గలదియు,

మూ॥ ఘనీభవత్ తటిత్ప్రభా ప్రవాహకల్ప జఙ్ఘికా
మతఙ్గజేన్ద్రనాసికా మనోజ్ఞసక్థిశోభినీ॥ 7

ఘనీభవించిన విద్యుత్ ప్రవాహమునకు సరియగు జంఘికలు (పిక్కలు) కలదియు, మతంగజేంద్రుని నాసిక (తొండము) వలె మనోజ్ఞములగు తొడలు గలదియు,

మూ॥ ప్రసూనసాయకాగమ ప్రవాద చుఞ్చుకాఞ్చికా
విశాల కేశచుమ్బితోల్ల సన్నితమ్బమణ్డలా॥ 8

ప్రసూనబాణ తంత్రప్రవాదచుంచువగు (కామతంత్రప్రవచన నిపుణమగు) కాంచిగలదియు, విశాల శిరోజచుంబితమును, విభాసితమును, అగు నితంబమండలము గలదియు,

మూ॥ అజాణ్డపిణ్డసంహతి ప్రపూర్ణ కుక్షిశాలినీ
అపార దివ్యకాన్తి వార్నిధాన నాభిదీర్ఘికా॥ 9

బ్రహ్మాండ – పిండాండ – సమూహము చేత బాగుగానిండిన బొజ్జ చేత విలసిల్లునదియు, అపారమైన జలముల వంటి దివ్యకాంతుల నిధి, గల దీర్ఘిక (నబడావి) వంటినాభి గలదియు,

మూ॥ బిస ప్రసూనసాయకచ్ఛురాభ రోమరాజికా
జగత్ త్రయావసజ్జనోప జీవ్యదుగ్ధభృత్కుచా॥ 10

బిసయుక్తమగు ప్రసూనమును బాణముగాఁబూను మదనుని ఛురిక (కత్తి) వంటి రోమరాజిగలదియు, జగత్త్రయియందు వసించుచున్న జనుల చేత నుపజీవ్యమగు స్తన్యమును (పాలను) వహించుచున్న పాలిండ్లు గలదియు,

మూ॥ మహేశకణ్ఠబన్ధక ప్రశస్త బాహువల్లరీ
సమస్తవిష్టపాభయప్రదాయి పాణిపఙ్కజా॥ 11

మహేశ్వర కంఠాలింగనము నొనర్చుచున్న ప్రశస్తములగు బాహువల్లరుల గలదియు, (వంజరువంటి శ్రేష్ఠములగు బాహువులు గలదియు) సమస్తలోకమునకును గూడ అభయ (రక్షణ) ప్రదాయియగు పంకేజము వంటి పాణిగలదియు,

మూ॥ విలోలహారమౌక్తిక ప్రతాన సంవదత్ స్మితా
విశుద్ధ సున్దరస్మిత ప్రకాశభాసితామ్బరా॥ 12

విశేషించి చలించుచున్న కంఠమాలాముక్తావలితో సంవాదము (సామరస్యము) నొందుచున్న మందహసితము గలదియు నిర్మలమగు సుందరస్మితము యొక్క ప్రకాశము చేత విభాసితమగు ఆకాశము గలదియు, (మహోజ్జ్వలగు ఉమాస్మితము - సర్వవ్యాపి.)

మూ॥ సుకోమలోష్ఠకమ్పన ప్రభీతదుర్జయాసురా।
సుయుక్తకున్దకుట్మల ప్రకాశదన్త పఙ్క్తికా॥ 13

మిగులమృదులమగు నీకెమ్మోవి యొక్క కదలిక వలన మిక్కిలి భయపడిన దుర్జయులగు నసురులు గలదియు, చక్కనికూడిక గలదియు, మల్లెమొగ్గల కాంతి వంటి కాంతిగలదియునగు దంతపంక్తిగలదియు,

మూ॥ శరత్ సుధాంశుమణ్డలప్రభావిగర్హణాననా
సుధామరన్దవజ్జపా సుమోపమాధరాధరా। 14

శరదృతువునందలి చంద్రమండల ప్రభను విగర్హించు (నిందించు) ముఖము గలదియు, సుధాపూరమును, మకరందవజ్జపా కుసుమోపమమును (తేనెతోఁగూడిన మంకెనపూవుతో సాటియగునదియు) అగు అధరాధరము గలదియు, (క్రింది పెదవి గలదియు.)



మూ॥ తిలప్రసూనచారుతాఉపహాసిభాసినాసికా।
నవీనవభాభనాసికా విలమ్బిదివ్యమౌక్తికా॥ 15

నూవుపూవు యొక్క మనోహరత నపహసించునదియై ప్రకాశించుచున్న నాసిక గలదియు, క్రొత్తదగు నక్షత్రముయొక్క మెరుపు వంటి మెరుపుగల నాసికయందు వ్రేలుచున్న దివ్యమగు మౌక్తికము గలదియు,

మూ॥ విశుద్ధగణ్డబిమ్బిత స్వరూపరత్నకుణ్డలా
మహామహస్తరఙ్గిత ప్రభావశాలిలోచనా॥ 16

విశుద్ధములగు కపోలములయందు ప్రతిబింబించిన స్వరూపములుగల కర్ణభూషణములగు రత్న ఖచితకుండలములు గలదియు మహాతేజ స్తరంగముల నుదయింపఁజేయుచున్న ప్రభావము (అనుభవము) చేత నొప్పుచున్న లోచనములు గలదియు,

మూ॥ దలా స్తరస్థయామినీప్రభు ప్రభాలికస్థలీ।
మయూరబర్హగర్హణ ప్రకృష్ట కేశభాసినీ॥ 17

సహస్రారమధ్యమునందున్న చంద్రుని ప్రభవంటి ప్రభగల లలాటస్థలి గలదియు, శిఖిబర్హగర్హణమగు (నెమలిపురి నతిశయించు) ప్రకృష్ట కేశపాశముచేత భాసించునదియు,

మూ॥ దివాకరాయుతోజ్జ్వలా హిమాంశులక్ష శీతలా
తటిత్ సహస్రభాసురా, నిరఙ్కచన్ద్రశేఖరా॥ 18

దశ సహస్రసూర్యుల యుజ్జ్వలత వంటి యుజ్వలతగలదియు, లక్ష చంద్రుల శీతలతవంటి శీతలత గలదియు, సహస్రవిద్యుత్తులకుఁ గల మెరుపువంటి మెరుపుగలదియు, నిష్కళంకుఁడగు బాలచంద్రుఁడు సిగపూవుదండ గాఁ గలదియు,

మూ॥ నభోఽ న్తరాలచారిణీ, మహా విచిత్రకారిణీ
కులాగ్నికుణ్డశాయినీ జగత్ కథావిధాయినీ॥ 19

ఆకాశాంతరాళమున సంచరించునదియు, మహావిచిత్రమును రచించునదియు, కులాగ్ని (మూలాధారాగ్ని) కుండమున శయించునదియు, జగత్ కథను ఘటించునదియు,

మూ॥ నభస్తలే బలేశ్వరీ, ధరాతలే క్రియేశ్వరీ
దివాకరే విభేశ్వరీ సుధాకరేరసేశ్వరీ॥ 20

నభస్తలమున - బలేశ్వరియు (బలరూపమగు నైశ్వర్యము గలదియు) భూతలమున - క్రియేశ్వరియు (క్రియారూపమగు నైశ్వర్యము గలదియు) దివాకరునందు,) విభేశ్వరియు, (ప్రభారూపమగు నైశ్వర్యము గలదియు) సుధాకరునందు - రసేశ్వరియు, (రసరూపమగు నైశ్వర్యము గలదియు)

మూ॥ మహేశవేశ్మ దీపికా, జగత్ త్రయ ప్రమాపికా
అశేషశీర్ష శాసినీ సమస్తహృన్నివాసినీ॥ 21

మహేశ్వర గృహదీపికయు, జగత్త్రయ ప్రమాపికయు, (త్రైలోక్యజ్ఞాన ప్రవర్తికయు) అశేష శీర్ష శాసినియు, (సర్వప్రాణుల సహస్రారములందును శాసించుచుండునదియు) సమస్తహృన్ని వాసినియు (అందఱి హృదయములందును వసించుచుండునదియు)

మూ॥ గుణ స్తవే గుణ స్తవే గుణప్రకర్షదాయినీ
విచిన్తనే విచిన్తనే విశిష్ట శక్తిదాయినీ॥ 22

ప్రతిగుణ స్తవమునందును స్తుతినొనరించు వారికి గుణోత్కర్షము నొసంగునదియు, ప్రతిధ్యానము నందును అత్యధికమగు శక్తి నిచ్చునదియు,



మూ॥ భ్రమాకులేన దుస్తరా, భవాలసేన దుర్గమా
అమన్త్రకేణ దుర్భరా జగత్ త్రయేణ దుర్జయా॥ 23

భ్రమచేత విక్షేపము (చలనము) నొందుచున్న మనస్సుగల మనుష్యునకు దుఃఖముచేత నెట్లో దాటుటకు శక్యమైనదియు, భవము చేత (జననమరణ రూపమగు సంసారము చేత) మందుఁడగు మనుజునకు పరిశ్రమచేత - నెట్లోపొందుటకు శక్యమైనదియు, మంత్రము (జ్ఞానరూపమగు విచారణము) లేని మనుష్యునకు కష్టము చేత - నెట్లో భరించుటకు శక్యమైనదియు, జగత్త్రయము చేతఁగూడ జయించుటకు శక్యము కానిదియు,

మూ॥ సువర్ణ చేలధారిణీ సమస్తమోదకారిణీ
విలాసినీ నిరామయా విచిన్త్యతాం మనస్త్వయా॥ 24

బంగారు చీరెను ధరించునదియు, అందఱకును ఆనందమును గూర్చునదియు, రోగము లేనిదియు, విలాసవతియునగు దేవి - ఓ మనమా! నీ చేత ధ్యానింపఁబడుఁగాత!

**ప్రభ:- 4**వ సంఖ్యగల శ్లోకము నుండి, **24**వ శ్లోకము వఱకును గల **21** శ్లోకములలోను దేవీ స్వరూపము ప్రతిపాదింపఁబడినది. ఆ శ్లోకముల క్రింద వానియర్థము మాత్రమే సంగ్రహింపఁబడినది. ఇచ్చట వాని విశేషార్థ-భావార్థములు తెలుపఁబడును. ఇందు - ఉద్ఘాటింపఁబడిన దేవీ స్వరూపమును సాధకుఁడు ధ్యానించి. యోగసిద్ధి నొందునది. 'జగజ్జననియగు లలితాదేవి - అమితప్రభగల సువర్ణసాలభంజిక (బంగారుబొమ్మ) నడుచుచున్నట్లుండును. కోమలమగు శరీరము గలిగి, ప్రత్యగ్ర కుసుమ మితవల్లివలె, కమనీయమగు శోభ గలిగియుండును. తనబంగారు పాదుకల చెంత దేవతలు మోకరిల్లునపుడు వారి కిరీటములయందలి రత్నముల కాంతులు వానియందు ప్రసరించి తళుకులీనుచుండును. కాలియందెలచేత ఆడుహంసలను పిల్చుచున్నదా. యనునట్లు

– ఆమె హంసీగమనము విలసిల్లుచుండును. ఆమెనఖావళి – తెల్లని కిరణములు గల చంద్రుని కాంతి విశేషములను లాగికొన్నట్లుండును. ఆమె పాదసౌష్ఠవము (పాదముల ప్రశంసనీయత) ను – మునీశ్వరుల పరిశుద్ధమానసములు తక్క నింకేవియు గ్రహింపఁజాలవు. ఆమె జంఘికలు – (పిక్కలు) విద్యుత్ కాంతి ప్రవాహములు ఘనీభవించునట్లుండును. ఆమె యూరువులయందు – మతం గజేంద్ర శుండాసౌందర్యము మూర్తీభవించునట్లుండును. ఆమహేశ్వరి మణిమేఖల (మొలనూలు) స్మరతంత్ర శాస్త్ర ప్రవచన ప్రవీణ, నితంబమండలము – విశాల వినీల శిరోజచుంబితము, ఆయుదరము – బ్రహ్మాండములతోడను, పిండాండముల తోడను, నిండియున్నది. నాభిదీర్ఘిక (నడబావివంటి బొడ్డు) అంతులేని దివ్యకాంతులను జలములకు నిధివలె నుండును. రోమరాజి – మృణాళకలితమగు అరవిందబాణమును ధరించు మన్మథుని చిన్న కత్తివలె నుండును. ఆయమ్మ పాలిండ్లు – ముల్లోకములందును గూడ నివసించుచున్న ప్రజలందఱును గూడ త్రాగఁదగినంత పాలు గలిగినవి, త్రిలోకములందును గల ప్రాణులాయమ్మ స్తన్యమునే త్రాగుచున్నారు. ప్రశంసింపదగిన మంజరుల వంటి తన బాహువుల చేత నాయమ్మ – మహేశ్వర కంఠాలింగనము నొనర్చుచుండును. ఆమెపాణి – సమస్తజగదభయప్రదాయి. ఆ చిరునవ్వు – తనగళమునందున్న హారము నందలి ముక్తావళితో నేకీభవించినట్లుండును. ఆవిశ్వ సుందరస్మితము చేత ఆకాశముగూడ విభాసించుచుండును. ఆమెయధరము – సుకోమలము. అయినను రోషలాంఛనమగు ఆయధరస్పందన మాత్రము చేతనే – దుర్జయులగు రాక్షసులందఱును మిక్కిలి భయఁపడుచుందురు. దంతపంక్తి – చక్కని కూర్పు గలిగి – మల్లెమొగ్గల కాంతి వంటి కాంతి గలిగియుండును. ఆమెయాననము – శరచ్చంద్ర ప్రభను తిరస్కరించును. కెమ్మోవి – అమృతముతోఁ గూడినదై, తేనెతోఁగూడిన మంకెనపూవువలె ప్రకాశించును. నాసిక – తిలప్రసూన సౌందర్యము నపహసించి విభాసించును. **ఆ నాసికయందలి మౌక్తికము - నవీనమగు నక్షత్రము యొక్క శోభవంటి శోభను గలిగియుండును.** కర్ణభూషణములగు



రత్నకుండలములు – స్వచ్ఛములగు నామె చెక్కిళుల యందు ప్రతిబింబించుచుండును. ఆమె నేత్ర ప్రభావము తరంగములఁ బోలిన మహాతేజోఽంశములనుదయింపఁ జేయుచుండును. లలాటస్థలిఁ సహస్రార కమలాంతరస్థితుఁడగు చంద్రుని ప్రభవంటి ప్రభగలిగి విరాజిల్లుచుండును. కేశపాశము– శిఖిపింఛమును నిందించు ప్రకృష్టతను గలిగి – యొప్పారుచుండును. ఆమె యుజ్జ్వలత – కాంతి, పదివేల సూర్యులకు సరియగును. శీతలత – లక్షచంద్రులకు సాటివచ్చును. ఆ – భాసురత– (మెరుపు) వేయి మెరుపులకు సమమగును. ఆమహేశ్వరి – మచ్చలేని చంద్రుని తనసిగయందు పూలదండవలె ధరించునది. ఆకాశాభ్యంతరమున సంచరించును. మహాద్భుతముల నొనరించును. 'కు' శబ్దవాచ్యమగు భూమియందులయించును గావున మూలాధారమును – కులమని తాంత్రికులు చెప్పుదురు. ఆకులమునందలి యగ్నికుండమున నందీయమ్మ– (కుండలినీశక్తి యనునామమున) పరుండియుండును జగత్కార్యమును నడుపుచుండును. ఆకాశమున బలరూపము చేతను, భూతలమున, క్రియారూపము చేతను, సూర్యమండలమున విభా (కాంతి) రూపము చేతను, చంద్రమండలమున రసరూపము చేతను, తన్మయియై భాసించుచుండును. గృహిణిలేని గృహము – అంధకారమయమగును. కావున నాయమ్మ – మహేశ్వర గృహమున దీపికవలె విరాజిల్లును, ముల్లోకముల యందును గలతెలివి – యామెవలననే ప్రవర్తింపఁజేయఁబడుచుండును. కావున సర్వప్రాణుల శిరస్సులందును వెలసి సంకల్ప వికల్పముల నొనర్చుచుండును. ఎల్లరిహృదయములయందును నివసించుచుండును. ఆమె గుణములను స్తుతించువారికి ప్రతిగుణస్తవము నందునుగూడ గుణాతిశయమును ఘటించుచుండును. ధ్యానించు వారికి ప్రతి ధ్యానమునందును గూడ విశిష్టమగు శక్తిని విధించుచుండును. ఆమె సాక్షాత్కారము – భ్రాంతిశూన్యునికే లభించును. ఆమె – అలసతలేని వానికే సుగమయగును. మంత్రము లేనివాఁడామెను భరింపఁజాలఁడు. ఆమె నీముల్లోకములును గూడ జయింపఁజాలవు. ఆయమ్మ సువర్ణవస్త్రధారిణి,

సమస్తమోద కారిణి, విలాసిని, నిరామయ. కావుననే తన్నాశ్రయించిన వారికారోగ్యము నొసంగును. ఓమనసా! పూర్వోక్తమగు స్వరూపముగల ఆజగన్మాతను నీవు ధ్యానింపుము.

మూ॥ పదాబ్జవన్దినః కవేరియం ప్రమాణికావలీ
మహేశమానసేశ్వరీ గృహేమహోయకల్పతామ్॥ 25

పదారవిందస్తుతి పాఠకుఁడగు గణపతిక విచేత విరచితమగు ప్రమాణికావృత్త నిబద్ధమగు కృతిమాల – మహేశ్వరహృదయేశ్వరీ గృహమున మహోత్సవము ఘటించుఁగాత!

ఇది సవ్యాఖ్యమగు పందొమ్మిదవ స్తబకము

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (పంచమ శతకము – చతుర్థ స్తబకము)

## వింశ స్తబకము

**అవ:**– ఈ స్తబకమున – యోగనిష్ఠుఁడగు కవిసార్వభౌముడు– సర్వేశ్వరికీ విశ్వమునందుఁగల విభూతులను ప్రతిపాదించుచు, కవితా రామణీయక విసారులును, నిగమాగమసారభూతములును, అగు పరతత్త్వ సాక్షాత్కార సాధనములను గానము చేయుచు, సర్వసారమయి యగు దేవిని స్తుతించుచున్నాఁడు.

మూ॥ ప్రీతివికాసే స్వల్పతమో రోషవిశేషే భూరితరః
అద్భుతహాసో విశ్వసువో రక్షతు సాధుం హన్తుఖలమ్॥ 1

ప్రీతి – వికసించునపుడు, మిక్కిలి స్వల్పమును, రోషము – ప్రకాశించునపుడు, మిక్కిలి యధికమును, అగు జగన్మాతయొక్క ఆశ్చర్యకరమగు హాసము – సజ్జనుని రక్షించుగాత! దుర్జనుని నిగ్రహించుఁగాత!

**ప్రభ:**– జగజ్జననిహాసము – మందతమమగునపుడు (చిరునవ్వుగానున్నపుడు) ప్రేమ – వికసించుచుండును. అది యధికమగునపుడు (అట్టహాసమగునపుడు) రోషము స్ఫురించుచుండును. ఇట్లు ఒక్కటియే యగుహాసము చేత, అల్పత్వ–అనల్పత్వముల నాశ్రయించి – విరుద్ధమగు పని జరుపఁబడుచున్నది. కావుననే హాసము ఆశ్చర్యకరమగుచున్నది. అందు మొదటిదగు చిరునవ్వు – సజ్జనుని, రక్షించుగాత! అనియు, రెండవదగు అట్టహాసము దుర్జనుని శిక్షించుగాత వనియు క్రమముగాఁజెప్పబడినది. కావున నిది – యథాసంఖ్యాలంకారమగుచున్నది.